# తాతయ్య

మనుషులందర్లోకీ బ్రాహ్మలెక్కువ. బ్రాహ్మల్లో నియ్యోగులకంటె వైదీకులెక్కువ; తలకాయంతా గొరిగించి వెనకాల పిలక పెట్టుకుని పొద్దున్నే మూడు వేళ్లూ కనిపించేట్టు వీబూది పెట్టుకుని తద్దినాలూ అవీ పెట్టించే బ్రాహ్మలు చాలా మంచివాళ్లు. వాళ్లు అందరి ఇళ్లకూ వచ్చి “శ్రీకృష్ణపరబ్రహ్మణేనమః” అంటారు. అప్పుడు ఇంటివాళ్లమ్మ వచ్చి వాళ్ల చెంబులో బియ్యం పోస్తుంది. శూద్రవాళ్లు బిచ్చగాళ్లు. వాళ్లకి ముష్టివేస్తాం. ముష్టి ఒకచేత్తో వేస్తాం. బ్రాహ్మలకి బియ్యం రెండు చేతులా, దోసిట్లో పట్టుకొచ్చి వెయ్యాలి. వాళ్లు ముష్టివాళ్లు కాదు.

వాళ్లు మీసాలుంచుకోరు. ఇస్త్రీ బట్టలు కట్టుకోరు. చొక్కాలు తొడుక్కోరు. మా తాతయ్య చొక్కా తొడుక్కునేవాడు కాదు. చలికాలంలో రాత్రిపూట తప్ప. అప్పుడు ఎర్ర ఊలు కుళాయి కూడా పెట్టుకునేవాడు. దాన్లోనించి మొహం మాత్రమే కనపడేది. నెత్తీ, మెడా కనిపించేవి కావు. అది పెట్టుకుంటే తాతయ్య ఎవరో అల్లే ఉండేవాడు.

తాతయ్య ముష్టి ఎత్తేవాడు కాదు. తద్దినం పెట్టేటప్పుడు ఆయన కూడా బ్రాహ్మలతోపాటు మంత్రాలు చదివేవాడు. తద్దినం బ్రాహ్మలు తాతయ్యకన్న ముందు తినేవాళ్లు. అయితే తాతయ్యను వాళ్లు అన్నం తాకనిచ్చేవాళ్లు. తద్దినానికి గారెలూ, పరమాన్నమూ చేస్తారుగానీ పులుసు చెయ్యరు. కందిపప్పు కూడా వండరు. పెసరపప్పు వండుతారు.

తద్దినం పెట్టించే బ్రాహ్మలంత మంచి బ్రాహ్మడు కాకపోయినా వాళ్లు తాతయ్యను గౌరవంగా చూసేవాళ్లు. తాతయ్యకు ఇంగ్లీషు రాదు. అందుకని తాతయ్య నాన్నని గొప్పగా చూసేవాడు. నాన్న తాతయ్యంత మంచి బ్రాహ్మడు కాదు. నాన్నకు మీసాలుండేవి. ఇస్త్రీ బట్టలు కట్టుకునేవాడు. బిళ్లగోచీ పెట్టుకునేవాడు కాదు. వాలుగోచీ పెట్టుకునేవాడు. తాతయ్యలా భోజనం చేసేటప్పుడు గంధం అక్షింతలు పెట్టుకునేవాడు కాదు. చాచ్చుక్క పెట్టుకునేవాడు. పట్టుబట్ట కట్టుకుని భోంచేసేవాడు. పట్టుబట్టకంటె మడిబట్టే ఎక్కువ. మడిబట్టలు ఆరేసినప్పుడు పిల్లలు ముట్టుకుంటే మైలపడతై. తడిబట్టకన్న మడిబట్టే ఎక్కువ. దారప్పోగు తొక్కితే మడిగట్టుకున్న ముసలివాళ్లు మైలపడతారు. పత్తికి మైల లేదు.

శూద్దరవాళ్లు బ్రాహ్మలకంటె చాలా తక్కువ. వాళ్లు బ్రాహ్మలలా ఉండరు. చూడటానికి నల్లగా ఉంటారు. మా ఇంటికి కూరలు తెచ్చే మనిషి చాలా పచ్చగా ఉండేది. కాని, ఆ మనిషి మాట్లాడితే శూద్దరదని తెలిసేది. నల్లని బ్రాహ్మణ్ణీ, ఎర్రని శూద్దరవాణ్ణీ నమ్మరాదు. తాతయ్య

నల్లగానే ఉండేవాడు. అమ్మ ఆయన్ని నమ్మేదే కాని, అందరూ అట్లా అంటారు– ఎర్ర శూద్దరవాళ్లని నిజంగా నమ్మరాదు. మాకు కూరలు తెచ్చే మనిషి అమ్మతో అన్నీ అబద్ధాలాడేది. అమ్మ రోజూ దాంతో పోట్లాడేది. నాన్న దాంతో పోట్లాడేవాడు కాదు.

శూద్దరవాళ్లు మామసం తింటారు. వాళ్లు గంపలో పెట్టి కోళ్లకి ఈకలు తీస్తారు. ఈకలు తీస్తుంటే కోడి కొంచెంసేపు అరుస్తుంది. ఆ తరవాత మాట్లాడదు. ఈకలు తీసిన తరవాత కోడి గుర్తుపట్టేటట్టు వుండదు. అసహ్యంగా ఉంటుంది. శూద్దర ముసలమ్మలు కోడి తలకాయ దేవుడికి నైవేద్యం పెడతారు. నైవేద్యం పెట్టేటప్పుడు మంత్రాలు చదవరు. తాతయ్యలా వాళ్లు మడికూడా కట్టుకోరు. కోడి తలకాయ కోడి చూసినట్టు కాకుండా అదోరకంగా చూస్తుంది. కోడికి ఈకలు తీస్తుంటే బ్రాహ్మణ పిల్లలు చూడగూడదు.

బ్రాహ్మణ పిల్లలు శూద్దర వాళ్లింట్లో మంచినీళ్లు తాగరాదు. మంచినీళ్లలో ఒక చుక్క మజ్జిగ వేస్తేనే తాగవచ్చు. తాగే నీళ్లలో ఒక చుక్క మజ్జిగ వేస్తే ఏమీ కనిపించదు. మామూలు నీళ్లలానే ఉంటుంది. గొల్లవాళ్లు మజ్జిగలో నీళ్లు కలుపుకొస్తారు. మజ్జిగలో నీళ్లు కలిపితే అమ్మకి తెలుస్తుంది. శూద్దరవాళ్లు మజ్జిగలో నీళ్లు కలిపితే బ్రాహ్మలు తాగవచ్చు.

నియ్యోగులు మంచి బ్రాహ్మలు కారు. వాళ్లు సంధ్యవార్చరు. అనాచారంగా వుంటారు. ఎర్రగా నిలువుబొట్టు పెట్టుకుంటే వాళ్లు చూడటానికి బాగుంటారు. కాని, ఆ బొట్టునుబట్టి వాళ్లు మంచి బ్రాహ్మలు కారని తెలుస్తుంది. మీరు మంచి బ్రాహ్మలు కారని చలపతిరావుగారితో పిల్లలు అనరాదు. అలా అనటం మర్యాదగా ఉండదు. చాటుగా అనుకుంటాంగాని, ఎదురుగా ఉన్నప్పుడు నియ్యోగులని కూడా మంచి బ్రాహ్మల్ని చూసినట్టే చూస్తాం. శూద్దరవాళ్లను చూసినట్టు చూడం. పసిపిల్లలు నియ్యోగలిళ్లల్లో మంచినీళ్లు తాగితే తప్పులేదు. నియ్యోగుల నీళ్లల్లో మజ్జిగ చుక్క వెయ్యమని పసిపిల్లలు అనగూడదు. తాతయ్యంత పెద్దవాళ్లు నియ్యోగులిళ్లల్లో మంచి నీళ్లు తాగరు. ఎందుకంటే ముసలివాళ్లకు దాహం కాదు.

చలపతిరావుగారింట్లో ఏదన్నా అయితే తాతయ్య భోజనానికి పోడు. అమ్మా, నాన్నా, నేనూ పోతాం. మా ఇంట్లో తద్దినాలవీ అయితే చలపతిరావుగారింట్లో అంతా భోజనానికి వస్తారు. తాతయ్య వాళ్ల పక్కన భోంచేస్తాడుగానీ, వాళ్లు వెళ్లిన తరవాత విసుక్కుంటాడు. రైళ్లూ, రహదార్లూ వచ్చి లోకమంతా మాలకూడై పోయిందని తాతయ్య చెప్పేవాడు. తాతయ్య రైలుకు పొయ్యేటప్పుడు చొక్కా తొడుక్కుంటాడు కాని, కుళ్లాయి టోపీ పెట్టుకోడు.

రైలుదిగి వచ్చిన గుడ్డలు తాతయ్య వేరే పెడతాడు. నాన్న బయటికి వెళ్లొచ్చిన గుడ్డలు ఇంట్లోనే కలుపుతాడు. ఆ మైల తాతయ్యకు కలుస్తూనే ఉంటుంది. కాని, ఏంచేస్తాడూ? అంతా మాలకూడే.

మాలవాళ్లంటే బ్రాహ్మలకి భయం. మాలవాళ్లు మన దగ్గిరగా పోతారు. అప్పుడు మనం మైలపడతాం. కొందరు మాలవాళ్లు అరుస్తున్నా వినిపించుకోరు. వాళ్లు మంచి మాల

వాళ్లు కారు. దొరలు కూడా మాలవాళ్లే. వాళ్లు స్నానాలు చెయ్యరు. స్నానం చెయ్యకపోయినా వాళ్లు తెల్లగా ఉంటారు. మనం సబ్బు రాచుకున్నప్పుడు కూడా అంత తెల్లగా ఉండం. దొరలు గొప్పవాళ్లు. వాళ్లు ఇంటిదగ్గిర కూడా ఇంగిలీషు మాట్లాడతారు. దొరసాన్లు నెత్తిన పింగాణీ కంచాలు పెట్టుకుంటారు. బ్రాహ్మలు పింగాణీ కంచాల్లో తినరాదు. పింగాణీ కంచాల్లో తినేది సాయిబులు.

సాయిబులు దూదేకుతారు. దూదేకుతుంటే మొదట కాస్సేపు వినటానికి బాగుంటుంది. తరవాత చూడటానికి అసహ్యంగా ఉంటుంది. బలంకలవాడు దూదేకే మరను నిలువుగా పట్టుకుని దాంతో బాణాలు వెయ్యొచ్చును. సాయిబులు జట్కాబండి తోల్తారు. ఎద్దుబండి తోలరు. సాయిబులు గుడ్డలు కుడతారు. సాయిబులు ఇంకేమీ చెయ్యరు. వాళ్లు వీధి బళ్లోకొచ్చి చదువుతారు.

సాయిబుల సన్నాయి మేళం బాగుంటుంది వినటానికి. సాయిబులు పెళ్లికి ఆ మేళం వాయిస్తారు. పెళ్లికొడుకు మొహానికి మల్లెపూదండలడ్డం పెడతారు. సాయిబుల పెళ్లికొడుకు గుర్రమెక్కి ఊరేగుతాడు. సాయిబుల పెళ్లికూతుళ్లు ఊరేగరు. గుర్రమెక్కటం చాతకాకపోతే సాయిబులు పెళ్లి చేసుకోరు.

పీర్ల పండక్కి పెద్దపులి వేషాలు వేసి ఆడతారు. మహన్నవమాల్లో పోలీసువాళ్లు భేతాళ వేషాలు వేస్తారు. భేతాళుణ్ణి చూస్తే పిల్లలు దడుచుకుంటారు. చూడటానికి పెద్దపులి వేషాలే బాగుంటై.

శ్రీరామనవమి కూడా భలే బాగుంటుంది. ఊరంతటా పందిళ్లు వేస్తారు. పందిళ్ల కింద చల్లగా ఉంటుంది. శ్రీరామనవమి నాడు వాటినిండా జనం ఉంటారు. చిన్న పిల్లలు ఆ జనంలోకి పోరాదు. పోతే మారుబడతారని పెద్దవాళ్లు కోప్పడతారు. కాని, అన్నీ వొట్టిదే. ఎక్కడికి పోయినా పిల్లలు మారుపడరు. చిన్నపిల్లలు పొట్టిగా ఉండటం వల్ల దేముడూ, పూజా కనిపించవు.

ఊరంతా కలిసి చేసుకునే పండగలన్నీ ఎంతో బాగుంటై. కార్తీక మాసంలో వన సంతర్పణలు చేస్తారు. అప్పుడన్ని కులాలవాళ్లూ కలిసి కూర్చుని భోంచేస్తారు. మన ఎదురుగా కోమట్లూ శూద్దుర్లూ కనిపిస్తారు. అట్లా భోంచెయ్యనిస్తే బాగుంటుంది కాని, భయం వేస్తుంది. ఉసిరి చెట్టున్నచోట కులభేదాలు లేకుండా భోంచెయ్యవచ్చుట. మా దొడ్లో ఉసిరి చెట్టుందికాని, తాతయ్య మూలాన మా ఇంట్లో శూద్దరవాళ్లకి అన్నం పెట్టం. తాతయ్య వన భోజనాలకున్నాడా రాడు.

సప్తాహం చేసేటప్పుడు కూడా ఊళ్లోవాళ్లంతా భోజనాలకి పోతారు. రోజల్లా భజన చేస్తారు. రాత్తిరి హరికథలు చెబుతారు. భజనలు చేసేచోట చిన్నపిల్లల్ని ఆరుమనీ పెట్టి వాయించనిస్తారు. చిన్న పిల్లలు వాయిస్తే మోత ఒకసారి ఎక్కువగా, ఇంకోసారి తక్కువగా వస్తుంది. అదీకాక చెయ్యి నెప్పుడ్తుంది. చేతులు మార్చినా లాభం ఉండదు. ఆఖరుకు రెండు చేతులూ ఉపయోగించాలి సొస్తుంది. రెండు చేతులూ నెప్పెత్తినప్పుడేడుపొస్తుంది. చేతులు నెప్పెత్తినా భజన దగ్గిర ఆరుమనీ వాయించటం పుణ్యం. ఏడుపొస్తే ఎవరన్నా చూస్తారేమో అని సిగ్గేస్తుంది.

ఊళ్లోకి సర్కసు వస్తే చాలా సరదాగా ఉంటుంది. ఊళ్లోకి సర్కసు రాగానే వాన కురుస్తుంది. సర్కసు డేరా పొలంలో వేస్తారు. వానకు పొలమంతా మోకాలు లోతు బురద అవుతుంది. డేరా దగ్గిరికి ఆ బురదలో నడిచివెళ్లాలి. జనం కూర్చునే చోట ఊక పోస్తారు. ఊకమీద కూర్చుంటే బురద అంటదుగాని, లాగు తడిసి చల్లగా ఉంటుంది.

సర్కసు దగ్గిర సోడాలమ్ముతారు. చిన్న పిల్లలు సోడా తాగుతారంటే నాన్నకి కోపం- చలపతిరావుగారికి కోపం లేదు. సోడా తాగితే నోరు కారంగా ఉంటుంది. ముక్కుల్లో ఘాటుగా ఉంటుంది. సోడా సీసాలో గుండు అడ్డం పడ్డప్పుడు మాత్రం హాయిగా వుంటుంది. సర్కసు చూడటానికి బాగుంటుందికాని, వాళ్లు చేసే పనుల్లో కష్టమేమీ లేదు. వాళ్లు చాలా సులభంగా చేస్తారు. ఒక్కసారయినా తప్పరు. కాని, చిన్న గొడుగు పట్టుకుని తీగమీద నడవటం భలే కష్టం; అందుకనే ఆ పిల్ల అంత భయపడుతూ నడుస్తుంది. ఆ పిల్ల క్రిందపడితే పట్టుకోటానికి ఒక మగవాడుంటాడు. పిల్లకేసి చూస్తుంటాడు. పిల్ల ముందుకుపోతే తనూ ముందుకుపోతాడు. వెనక్కొస్తే వెనక్కొస్తాడు. పరిగెత్తితే పరిగెత్తుతాడు; తీగెమీద నడిచే పిల్ల ఎంతో చక్కగా ఉంటుంది. ఆ పిల్లతో ఆ మొగవాడు మాట్లాడుతాడు. ఆ పిల్ల అబ్బాయిని చూసి నవ్వుతుంది. ఇంకెవర్నీ చూసి నవ్వదు. సర్కసు వెళ్లిపోయిన తర్వాత కూడా ఆ పిల్ల మనకు జ్ఞాపకం వస్తుంది.

సర్కసు వెళ్లిపోయిన తరవాత చిన్న పిల్లలు చిన్న కర్రలకు నులకతాడు కట్టి ఉట్టుట్టి ఏనుగులను ఆడిస్తారు. నులక కొరడాలు చళ్‌మనవు.

తాతయ్యకు ఊళ్లో చేసుకునే పండుగలేవీ ఇష్టంలేదు. తాతయ్య ఆఖరుకు సర్కసు కూడా చూడరు. ఆయనకి ఇంట్లో చేసుకునే పండుగలే ఇష్టం. ఇంట్లో చేసుకునే పండుగలు ఊళ్లో చేసుకునే పండుగలంత బాగుండవు. పిండివంటలు చేస్తారుగాని, మన ఇష్టం వచ్చినట్టు తిననివ్వరు. తాతయ్య నోట్లో మెతుకులు వేసుకునేదాకా మనం అన్నం కలుపుకోకూగూడదు. పండుగ రోజున గోగు పచ్చడిగాని, కందిసున్నిగాని వెయ్యమంటే అమ్మ తిడుతుంది.

చలపతిరావుగారింట్లో చేసుకున్న పిండివంటలు నా కోసం మీనాక్షి తెస్తుంది. అప్పుడు అమ్మ మీనాక్షిని ఎంతో ఆపేక్షగా చూస్తుంది. మీనాక్షికి మా ఇంట్లో పిండివంటలు కూడా పెడుతుంది. పండుగైన మర్నాడు మిగిలిన పిండివంటలు తాతయ్య చూడకుండా అమ్మ నాకూ, నాన్నకూ పెడుతుంది.

పిండివంటలు జాస్తిగా తింటే జరం వస్తుంది. జరం వస్తే దిగులేస్తుంది. ఆకలెయ్యదు. జరమొచ్చినప్పుడు ఎవరూ చూడకుండా ఏమన్నా తింటే నోరు చేదుగా వుంటుంది. జరమొచ్చిన పిల్లలకి అజీర్ణం మాత్తర్లేస్తారు. అవి మింగితే గొంతులో వికారంగా ఉంటుంది. జరం వొచ్చినట్టదే గుర్తు.

జరం పిల్లలకే వస్తుంది. పెద్దవాళ్లకి రాదు. పెద్దవాళ్లు చచ్చిపోతారు. పెద్దవాళ్లు చచ్చిపోయినప్పుడు ఆడవాళ్లేడుస్తారు. మగవాళ్లు ఏడవరు. దిగులుగా ఉంటారు. దిగులుగా

ఉన్నప్పుడు నవ్వరు. దిగులుగా ఉన్నట్టు అదే గుర్తు. చచ్చిపోయిన తరవాత తాతయ్య చచ్చి పోయినట్టు లేదు. నిద్దరపోతున్నట్టున్నాడు; అయితే తాతయ్య నిద్దర్లో గురకపెడతాడు. కాని, ఆ గురక పెట్టేటప్పుడు నిద్దరపోరు. తాతయ్య నిద్దరపోకుండానే గురక పెడుతుంటే అమ్మావాళ్లు ఆయన నోట్లో తులసి తీర్థం పోస్తారు. అయితే తాతయ్య తులసిదళం నమిలి మింగలేదు. అది ఆయన పెదిమల మధ్య ఇరుక్కుంటుంది. అమ్మ మెల్లిగా ఆ దళాన్ని చేత్తో తీసేస్తుంది. చచ్చిపొయ్యేటప్పుడు అమ్మ తాతయ్యను తాకుతుంది. అప్పుడు నాన్న ఆయన చెవిదగ్గిర మూతిపెట్టి 'నారాయణ, నారాయణ' అని జపం చేస్తాడు.

తాతయ్య ఏం చెబుతాడో అడగమని నాన్నని అంతా అడిగారు. నాన్నకి అడగటం ఇష్టం లేదు. కాని, అంతా అడగమంటుంటే అడుగుతాడు. తాతయ్యను 'నాన్నా నాన్నా' అని పిలుస్తాడు. మాకేం చెబుతావంటాడు నాన్న. అప్పుడు నాన్న మాట్లాడుతుంటే ఎవరో అల్లే ఉంటుంది. తాతయ్య నాన్నకు సమాధానం చెప్పడు. ఊరికే గురకపెడతాడు. తాతయ్య చచ్చిపోయినా కళ్లు తెరుచుకునే ఉన్నాడు. కాని, ఆయన గుడ్డి బిచ్చగాడల్లే ఎవరివంకా చూడలేదు. గుడ్డి బిచ్చగాణ్ణి చూస్తే నాకు భయం. నాన్న వాణ్ణి గురించి చెబితే జాలేసింది. దేవుడు తాతయ్యను చూసి జాలిపడతాడు. ఎందుకంటే చచ్చిపొయ్యేటప్పుడు తాతయ్య గుడ్డి బిచ్చగాడల్లేనే ఉన్నాడు. చచ్చిపోయిన తరవాత తాతయ్యకు ఇల్లూవాకిలీ లేదు. తాతయ్యను ఎక్కడికో తీసుకుపోయినారు. ఆయనకి పొలాలు కూడా లేవు. ఇక రైతులతో తాతయ్య పోట్లాడడు.

తాతయ్య పోట్లాడినా రైతులకు కోపం లేదు. వాళ్లు శూద్దుర్లు. ఒక రైతు వచ్చి తాతయ్య చచ్చిపోయినందుకు ఏడిచాడు. మగవాళ్లు ఏడుస్తుంటే భయమేస్తుంది. నాన్న ఏడవలేదు. ఆయన నవ్వకపోవటం చూస్తే దిగులుగా ఉందని తెలుస్తుంది.

తాతయ్యని యములవాళ్లు పట్టుకెళ్లారు. యములవాళ్లు మనకి కనిపించరు. తాతయ్యకు కనిపిస్తారు. తాతయ్య కోసం విమానం రాలేదు. నాయనమ్మ చచ్చిపోయినప్పుడు విమానం వచ్చింది. 'నా కోసం విమానం వచ్చింది. పోతున్నా'నని ఆవిడే చెప్పింది. తాతయ్య తనకోసం విమానం వచ్చిందని చెప్పలేదు. పోతున్నానని కూడా చెప్పలేదు. తాతయ్య ఎంత మంచి బ్రాహ్మడైనా నరకానికే పోతాట్ట. అమ్మ చెప్పింది. ఎంత మంచివాళ్లన్నా కాస్త పాపం చేస్తారుగనక నరకానికి పోతారు.

యమలోకం భయంకరంగా ఉంటుంది. అక్కడ యములవాళ్లు చచ్చిపోయిన వాళ్లని రంపాలతో కోస్తారు. గదలుపెట్టి కొడతారు. నిప్పుల్లో కాలుస్తారు. కాగే నూనెలో ఉడక పెడతారు. యములవాళ్లను చూస్తేనే, చచ్చిపోయినవాళ్ల ప్రాణాలు కాస్తా పోతై. కోళ్లను కోసేవాళ్లను వాళ్లు రంపాలతో కోస్తారు. కాని, మనని కోసినందుకు వాళ్లకి పాపంలేదు.

మనమంతా ముసలివాళ్లమయిన తరవాత తాతయ్యల్లేనే చచ్చిపోతాం.

❄

మొదటి ముద్రణ: 1940